క్లుప్తంగా

వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

తెనాలి: పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 6–9 తేదీల్లో వెబ్‌సైట్ http://40.81.241.107/APVOLUNTEER20/apvolunteer090420201049లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. గత జనవరి ఒకటో తేదీ నాటికి 18–35 సంవత్సరాల మధ్య వయసు ఉండి, పదోతరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయనీ, మహిళలకు 50 శాతం ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని 10న పరిశీలన అనంతరం 14, 15 తేదీల్లో ఇంటర్వ్యూలు చేస్తామని తెలిపారు. ఎంపికైన వలంటీర్లను ఈనెల 17న ప్రకటించి, అదేరోజు నుంచి విధుల్ని అప్పగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

పరస్పర దాడులపై కేసుల నమోదు

తెనాలి రూరల్: పాత కక్షల నేపథ్యంలో అన్నదమ్ముల కుటుంబాలు పరస్పర దాడికి పాల్పడిన కేసులో తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తెనాలి మండలం ఖాజీపేటకు చెందిన అన్నదమ్ములు కాలిశెట్టి వెంకటేశ్వరరావు, కాలిశెట్టి శ్రీనివాసరావు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. జనవరి 29న రెండు కుటుంబాలు ఘర్షణ పడగా, నలుగురు గాయాలపాలయ్యారు. ఇరు వర్గాలు రూరల్ పోలీసుల్ని ఆశ్రయించిగా పరస్పర కేసులు నమోదు చేశారు. అన్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తమ్ముడు శ్రీనివాసరావును శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్టు రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ సాయికృష్ణ కల్యాణ కళావేదిక ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బీఎఫ్‌ఏ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మణిపాల్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, దంత వైద్య పరీక్షలు జరపనున్నట్లు తెలిపారు. మూత్రపిండ వైద్య నిపుణులు డాక్టర్ మహ్మద్ అస్లాం, మూల్పూరు పీహెచ్‌సీ వైద్యులు ఆకురాతి శ్రీనివాసరావు, దంత వైద్య నిపుణులు కొన్నిపాటి రోజా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శంకర నేత్ర చికిత్సాలయం (తెనాలి) ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా శుక్లాల ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 11న పేషంట్లను తెనాలి తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. శిబిరంలో ఆప్తమాలజిస్ట్ చైతన్య, పీఆర్వో వి.సోమరాజు, సిబ్బంది ఫిరోజ్, రెహమత్, యువాన్, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య పాల్గొన్నారు.

తాళ్లమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పణ

నగరం: గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజిస్తే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని ధూళిపూడి గ్రామం తాళ్లమ్మ అమ్మవారి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా ఎంపీ మోపిదేవి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఎక్కడ దేవుడు పూజింపబడుతాడో ఆ ప్రాంతంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. వేద పండితులు ఎంపీ మోపిదేవికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ హేమామృతం, వైఎస్సార్ సీపీ నాయకులు విచారపు కుటుంబరావు, రాఘవేంద్ర, ఆనంద్, బాబురావు పాల్గొన్నారు.

వైభవంగా బూరుగులమ్మ తిరునాళ్లు



రేపల్లె: మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా రేపల్లె గ్రామదేవత బూరుగలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అఖండ దీప స్థాపన, పంచామృత, ఫల రసాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 29వ వార్డులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం
- రూ.21.56 కోట్లతో వార్డులో సంక్షేమ పథకాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 29వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, రూ.21.56కోట్లతో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 29వ వార్డులో కొనసాగించారు. వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాబాయి, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలోతు భిక్షాలు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీనునాయక్, బలుగొరి సురేష్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. సైడ్ కాల్వలో మురుగునీరు పారుదల కావడం లేదని, ఖాళీ స్థలాల్లో రాత్రివేళల్లో పాములు వస్తున్నాయని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మహిళలు కోరారు. డ్వాక్రా మహిళల నుంచి కొందరు నగదు వసూలు చేస్తున్నారని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చేనేత కార్మికులకు పింఛన్ ఇప్పించాలని, కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని, దత్తాత్రేయస్వామి గుడి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆ వార్డులోని ప్రజలు కోరారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి గురించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని కులాలు, రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నామని చెప్పారు. చేనేత కార్మికుల కుటుంబానికి ఏడాదికి రూ.24వేలు బ్యాంకులో జమ చేస్తున్నామని, వార్డులో ఇప్పటి దాకా వారికి రూ.2.80లక్షలు బ్యాంకులో జమ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు పింఛన్లు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసాల ద్వారా నగదు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రజల అవసరాల్ని తీర్చడానికి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

డ్వాక్రా మహిళలు చేసిన ఫిర్యాదుపై విచారణ చేసి, ఆరోపణలు రుజువు అయితే వారికి తొలగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, దుబాయ్‌బాబు, వార్డు నాయకులు పతకమూరి శ్రీహరి, కొతవరపు వెంకటరమణ, శ్రీను, మల్లెల యలమంద, బాణాల రాజేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, కఠారి హరీష్, అడుసుమల్లి శ్రీనివాసరావు, కాళిదాసు సత్యం, శానంపూడి రఘురామిరెడ్డి, చుండూరు సాయి, బండ్లమూడి భాస్కరరావు, షేక్ గఫూర్, కిక్కురి కృష్ణారెడ్డి, చుండూరు సాయి, కోలా వాసు పాల్గొన్నారు.

కళల కాణాచి తెనాలి వారసుడు పరమేశ్వరశర్మ

సరస్వతి మాత విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే శివకుమార్



విగ్రహాన్ని ఆవిష్కరించి హారతినిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ రంగస్థల నటుడు, 'నూరేళ్ల తెనాలి రంగస్థలి' గ్రంథ రచయిత నేతి పరమేశ్వరశర్మ కళల కాణాచి తెనాలి వారసుడని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలికి కీర్తి తెచ్చిన కళా సంస్థలు, కళాకారుల జీవిత చరిత్రల్ని గ్రంథస్తం చేసి ఆయన చిరస్మరణీయులైనట్టు చెప్పారు. తెనాలి సాంస్కృతిక వైభవానికి ఆ గ్రంథం దర్పణమని వ్యాఖ్యానించారు. పరమేశ్వరశర్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు శనివారం వివిధ సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు సరస్వతి మాత విగ్రహాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా అటు విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూనే పరమేశ్వరశర్మ నాటకకళకు ఎంతగానో సేవచేసినట్టు చెప్పారు. వివిధ నాటక సమాజాల్ని నిర్వహిస్తూ 30 నాటకాల్లో పలు పాత్రల్లో నటిస్తూ దశాబ్దాల పాటు కళారంగంలో వెలిగినట్టు చెప్పారు. వృత్తి, ప్రవృత్తి వ్యాపకాల నుంచి విరమించుకుని విశ్రాంత జీవితం గడుపుతూనే పరమేశ్వరశర్మ, గత వందేళ్లకాలంలో తెనాలికి చెందిన కళాకారుల జీవిత చరిత్రలు, కళాసంస్థల వివరాల్ని సేకరించడం అసాధారణమని తెలిపారు. మూడేళ్లకు పైగా నిబద్ధతతో చేసిన కృషి ఫలితంగానే నూరేళ్ల తెనాలి రంగస్థలి వెలువడిందని గుర్తుచేశారు. అంతటి మహానుభావుడి ప్రథమ వర్ధంతికి విభిన్న సేవల్ని అందిస్తున్న కుటుంబసభ్యుల్ని అభినందించారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను ఇవ్వడం ఎంతగానో ప్రయోజనకరమని వివరించారు. టాబ్‌ల వినియోగం, ప్రయోజనాలపై విద్యార్థుల్ని అడిగి స్వయంగా తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ పరమేశ్వరశర్మ తెనాలి సాంస్కృతిక వైభవాన్ని రికార్డు చేయటం నేటితరానికి గొప్ప వరమని చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పరమేశ్వరశర్మ కుటుంబ సభ్యులు నేతి సీతారామరాజు, నేతి శ్రీరాములు, నేతి చలపతి, సత్య సుబ్రహ్మణ్యం, వెంకట కమ్ముల, శశికళ, నాగరిషిక శ్రీనంద్ పాల్గొన్నారు. సాయంత్రం పరమేశ్వరశర్మ ఇంటి వద్ద వంద మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పాత్రలను పంపిణీ చేశారు.

వాణీ జయరాం మరణం సినీ పరిశ్రమకు తీరని లోటు



వాణీ జయరాం దంపతులను సత్కరించిన నన్నపనేని రాజకుమారి (ఫైల్)

తెనాలి రూరల్: ప్రముఖ నేపథ్య గాయని వాణీ జయరాం మరణంపై మా–ఏపీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. స్థానిక మా–ఏపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు నివాళులు అర్పించారు. మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా తిరుగులేని గాయనిగా జాతీయ పురస్కారాలు, అనేక రాష్ట్రాల అవార్డులు అందుకున్న వాణీ జయరాం నిగర్విగా ప్రశంసలు పొందినట్లు తెలిపారు. ఒకవైపు కళాతపస్వి విశ్వనాథ్ మరణాన్ని జీర్ణించుకోలేకపోతుంటే మరోవైపు ఒక్కరోజు వ్యవధిలోనే వాణీ జయరాం మరణించడం సినీ పరిశ్రమకు తీరనిలోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలక్షణమైన స్వరంతో 19 భాషల్లో వేలాది పాటలు పాడిన గానకోకిల వాణీ జయరాం అని దిలీప్‌రాజా కొనియాడారు. కార్యక్రమంలో మా–ఏపీ సభ్యులు పినపాటి సురేష్ బాబు, దోనేపూడి శరత్, చినరాయుడు, రమణయ్య పాల్గొన్నారు .

వాణీ జయరాం మృతికి రాజకుమారి సంతాపం

తెనాలి: ప్రముఖ సినీ గాయని వాణీ జయరాం ఆకస్మిక మృతికి పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయనేత, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి విచారం వ్యక్తం చేశారు. భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న ఆమె అకాల మరణం పాటకు తీరని లోటని వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాణీజయరాం 2011 డిసెంబరులో హైదరాబాద్‌లో సంగీతంపై కళాఫౌండేషన్ నిర్వహించిన వర్క్‌షాపునకు తనను ఆహ్వానించినట్టు గుర్తు చేసుకున్నారు. ఆ వేదికపై దంపతుల్ని సత్కరించినట్టు చెప్పారు. అదే సభలో సుప్రసిద్ధ నటుడు అక్కినేని నాగేశ్వరరావు కూడా ఉన్నారని వివరించారు.

మరుగుదొడ్లను తొలగించాలి



చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

తెనాలి రూరల్: నరేంద్రదేవ్ కాలనీలోని తెలుగు, ఉర్దూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల క్రీడా స్థలంలో అక్రమంగా నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే తొలగించాలని విద్యార్థులు మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్‌ను కోరారు. ఒకే ఆవరణలో ఉన్నా తెలుగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటేపల్లి సాంబశివరావు ఉర్దూ పాఠశాల విద్యార్థులను రానీయకుండా అడ్డంగా మరుగుదొడ్లను నిర్మించారని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

'జేమ్స్ ఆడమ్స్'తో ఐలవరం విద్యార్థుల భేటీ రేపు

భట్టిప్రోలు: అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలో డిప్యూటీ చీఫ్ టెక్నాలజిస్టుగా మూడున్నర దశాబ్దాలు పని చేసి ఇటీవల రిటైర్డ్ అయిన జేమ్స్ ఆడమ్స్‌ను సోమవారం ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంట్రాక్ట్ కానున్నారు. జేమ్స్ ఆడమ్స్‌కు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప టెక్నాలజిస్టుగా మంచి పేరుంది. పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ హెన్రీ ట్రూప్ అనే శాస్త్రవేత్త ద్వారా జేమ్స్‌ని ఆన్‌లైన్ ద్వారా కలసి.. తమ రాష్ట్రంలోని విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యేందుకు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన అంగీకరించారు. విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇవ్వనున్నట్లు హరికృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. వివరాలకు 97013 58838 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

రేపల్లె: అభయ ఫౌండేషన్ సహకారంతో షారోనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సొసైటీ ఫౌండర్ దాసరి భరణి శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు జేఎల్‌బీ కళాశాల రోడ్డులోని తమ షారోనా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. రేషన్, ఆధార్ జిరాక్స్‌లు, రెండు ఫొటోలతో దరఖాస్తులు అందించాలని తెలిపారు. వివరాలకు 8125760617 నంబరుకు సంప్రదించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సబ్సిడీపై కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందించనున్నట్లు వెల్లడించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

రేపల్లె రూరల్: మండలంలోని మోళ్లగుంటలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత నాంచారమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉదయం 9.06 గంటలకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు హాజరవుతారని వెల్లడించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందన



గుణశేఖర్, షానూన్‌ను అభినందిస్తున్న సాయి రేవతి, భార్గవ్ కుమార్

తెనాలి రూరల్: స్థానిక గంగానమ్మపేటలోని క్విక్ జిమ్‌లో శనివారం పతకాలు సాధించిన క్రీడాకారుల్ని అభినందించారు. జగ్గయ్యపేటలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో క్విక్ జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్న ఇద్దరు క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్– 17లో 74 కేజీల విభాగంలో కందిమళ్ల గుణశేఖర్ 400 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానంతో పాటు బంగారు పతకం సాధించాడు. అండర్ – 19 మహిళల 52 కేజీల విభాగంలో మధిర షానూన్ 125 కేజీల బరువునెత్తి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా వీరిని కోచ్‌లు ఘట్టమనేని సాయి రేవతి, పసుపులేటి శివరామకృష్ణ రాజు, కొమ్మినేని భార్గవ్ కుమార్ అభినందించారు.

వైభవంగా శ్రీ సువర్చలా హనుమత్ కల్యాణం



స్వామివారిని రథంపై ఊరేగిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

తెనాలి టౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం మైనాక వాహన సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీ వైదిక క్రతువును ఆగయుక్తంగా జరిపారు. రాత్రికి శ్రీ సువర్చలా హనుమత్ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, వెంకట దుర్గాభవాని దంపతులు, దివ్వెల వెంకట శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు పీటలపై కూర్చున్నారు. రాత్రికి స్వామివారిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'ఏఎన్‌యూ' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించిన డి.రామోహన్‌రావు తదితరులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ జట్లు తలపడ్డాయి. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు.. నాలుగు వికెట్ల తేడాతో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణరావు, సొసైటీ సభ్యుడు ఆవుల మధుసూదనారావు, ప్రిన్సిపల్ ఆచార్యులు షేక్ నజీర్, ఫిజికల్ డైరెక్టర్ అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

హార్మోనియం విద్యాంసులు, కళాకారులకు సన్మానం



వెంకట్రావు, ప్రభుదాసు, రమాదేవిలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి టౌన్: ఎన్.టి.రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో శనివారం సాయంత్రం ప్రముఖ హార్మోనియం విద్వాంసులు బొడ్డు వెంకట్రావును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తెనాలి ముద్దుబిడ్డ స్వర్గీయ జమునతో ఎన్‌టీఆర్ సినిమాల సమీక్ష, సినీ రాజకీయాల్లో వారి ఇద్దరి మధ్య విశేషాలు అనే అంశాలపై డాక్టర్ దేవరపల్లి ప్రభుదాసు, తుమ్మలగుంట రమాదేవి ప్రసంగించారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గీతాంజలి మూర్తి, ఉమ్మలనేని ధర్మారావు, వెనిగళ్ల శివప్రసాద్, పి.టి.అవధాని, కంచర్ల ఏడుకొండలు, దీనకుమారి, కంచర్ల నాగభూషణం, కెజియదాస్ పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను కాపాడుకోవాలి

ఏపీ కృష్ణ బలిజ సంఘం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ భవాని



సమావేశంలో పాల్గొన్న కృష్ణ బలిజ సంఘం నాయకులు

రేపల్లె: ఐక్యతతో కృష్ణ బలిజ సంఘీయులు తమ హక్కులను కాపాడుకోవాలని ఏపీ కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవానీ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కృష్ణ బలిజ సంఘీయుల సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం తమ సంఘీయులను అన్ని విధాలుగా ఆదుకుంటోందని అన్నారు. బీసీ ఉప కులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. పట్టణంలో కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కోలా అశోక్‌కుమార్, సంఘ పట్టణ కమిటీ అధ్యక్షుడు కుప్పం అంకమ్మరావు, సంఘం డైరెక్టర్ అన్నం నరసింహరావు, నాయకులు కోలా సాంబ శివరావు, బత్తుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కుంకుమ నోము



నోములో పాల్గొనే ముతైదువులకు పసుపుకుంకుమ, పండ్లు అందజేస్తున్న మహిళలు

తెనాలి టౌన్: తెనాలి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో మాఘమాసం సందర్భంగా ముతైయిదువులతో ఆదివారం కుంకుమ నోము నిర్వహిస్తున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. రామలింగేశ్వరపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నోములో పాల్గొనే ముతైయిదువులకు చీర, సారె, పసుపుకుంకుమ, పండ్లు అందజేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. సనాతన సంస్కృతికి పరిరక్షకులుగా కుంకుమనోములో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో వంగల జగదీశ్వరి, టి.సత్యజ్ఞాన ప్రసూనాంబ, బద్దు శ్రీదేవి, భారతుల సీతాకుమారి, సౌజన్య, కీసపాటి శాంతి, నాగలక్ష్మి, లక్కరాజు దుర్గ, బ్రాహ్మణ పరిషత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

వేమూరు: లబ్ధిదారులతో మాట్లాడి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్ సూచించారు. వేమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డ్వాక్రా గ్రూపుల సీసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. అధికారులు సక్రమంగా పని చేయకపోవడంతో మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వెనుకబడినట్లు తెలిపారు. నిర్మాణాలు వేగవంతం చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులతో సమానంగా నిర్మాణాలు ఉండాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ బొంత అర్జునరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారం

బాపట్ల టౌన్: మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారంగా మారుతుందని సెబ్ ఏఈఎస్ జి.నరసింహారావు తెలిపారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఫార్మసీ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తడంతోపాటు, యువత జైలుపాలు అవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు, పట్టణ ఎస్‌ఐ రఫీ, బాపట్ల ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుడు రసూల్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

రేపల్లె: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు రేపల్లె డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోకు శనివారం సాధారణ తనిఖీలకై ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18, 19 తేదీలలో రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి అరవపల్లి, గోవాడ, కోటప్పకొండ, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. గోవాడకు 20 సర్వీసులు, అరవపల్లికి 4 సర్వీసులు, కోటప్పకొండకు 20 సర్వీసులు, శ్రీశైలానికి 4 సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఆయా క్షేత్రాలకు వెళ్లే భక్తుల నుంచి కేవలం పాత ఛార్జీలే వసూలు చేస్తున్నామన్నారు. రేపల్లె నుంచి గోవాడకు రూ.45, రేపల్లె నుంచి అరవపల్లికి రూ.10 చార్జీలుగా నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలో బాపట్ల నుంచి రేపల్లె వయా నిజాంపట్నం కొత్త ఆర్టీసీ సర్వీసును ప్రారంభించినట్లు చెప్పారు. భక్తులు తిరునాళ్లకు వెళ్లే ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిపో మేనేజర్ డి.జాన్‌సుందరం పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి భూమి పూజ

కోనేటిపురం(భట్టిప్రోలు): హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కోనేటిపురం గ్రామం జగనన్న కాలనీలో లబ్ధిదారు యేమినేని విజయశ్రీ ప్లాటులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శనివారం భూమి పూజ చేశారు. డ్వాక్రా సిబ్బంది సహాయంతో ఇద్దరి లబ్ధిదారుల నుంచి రూ.70 వేలు నగదు ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయసారథికి అందజేశారు. కాలనీలో ఇప్పటికే పూర్తయిన బెల్లంకొండ లలిత గృహాన్ని సందర్శించి, సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఏపీఎం కొండూరి శోభన్, కార్యదర్శి టి.అనూరాధ, ఎ.చిన వెంకటేష్‌బాబు, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ జయ చంద్రకుమార్, సచివాలయ, డ్వాక్రా సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

షార్ట్ టెండర్ల ఆహ్వానం

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలో కొలువైన బాలకోటేశ్వరస్వామి దేవాలయానికి పెయింటింగ్ వేయుటకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్ట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలోగా టెండర్లను అందించాలని పేర్కొన్నారు.